క్లుప్తంగా

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఆత్మకూర్: అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతున్నాయని, విడతల వారిగా అందరికి న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నాయకులు గంగాధర్‌గౌడ్, రహెమతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీనివాస్ అన్నారు. శనివారం 8వ వార్డులో లబ్ధిదారుల ఇండ్ల భూమిపూజలో పాల్గొన్నారు. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షబ్బీర్, ఖలీం, వెంకటన్న, దామోదర్, అశోక్, బుచ్చన్న, మహేశ్, సాయి రాఘవ ఉన్నారు.

బీఎల్ఓలకు శిక్షణ



పాన్‌గల్: ఓటరు జాబితాలో మరణించిన వారి పేర్లు తొలగింపు, 18 ఏండ్లు నిండిన యువతీ, యువకుల పేర్లను చేర్చడంపై బీఎల్ఓలకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని సూచించారు. తొలగింపులు, చేర్పులపై ఖచ్చితమైన సమాచారం ఉంటేనే తీసివేయాలన్నారు. కార్యక్రమంలో శిక్షకులు శ్రీకాంత్, ఆంజనేయులు, తహసీల్దార్ అబ్రహాంలింకన్, డీటీ అశోక్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

రైతు గుర్తింపుకార్డు నమోదు



వనపర్తి రూరల్: రైతుకు విశిష్ట గుర్తింపుకార్డును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఈఓ యుగేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని నాచహళ్లిలో ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ రూ.2వేల, పంటబీమా, ఎరువులు రైతులకు అందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

ఏడీఏగా తిప్పేస్వామి

పాన్‌గల్: వ్యవసాయ శాఖ డివిజన్ సహాయ సంచాలకుడు(ఏడీఏ)గా తిప్పేస్వామి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీఏగా పనిచేస్తున్న చంద్రశేఖర్ హైదరాబాద్ జీహెచ్ఎంసీకి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొడంగల్ నియోజకవర్గంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న పదోన్నతిపై బదిలీపై వచ్చారు. తోటిసిబ్బంది, ప్రజాప్రతినిధుల సహకారంతో సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ రాజవర్ధన్‌రెడ్డి, వీపనగండ్ల ఏఓ డాకేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

మొక్కలను సిద్ధం చేయండి



పాన్‌గల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ గోవింద్‌రావు ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం మండలంలోని బండపల్లి నర్సరీని సందర్శించి నర్సరీలో మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధుల నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వసంతకుమారి, ఉపాధిసిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



వీపనగండ్ల: అనారోగ్యానికి గురవుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్‌ఫండ్ ఉపయోగంగా ఉంటుందని మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు రావుల నారాయణ రెడ్డి, వల్లభాపురం మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం గ్రామంలో రూ.40 వేల చెక్కును సంధ్యా కాశీనాథ్‌లకు అందజేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో వందలాది మందికి అందించినట్లు వారు తెలిపారు.

వనమహోత్సవ లక్ష్యం చేరేనా?

- 1.30 లక్షల మొక్కలు ఏర్పాట్లు
- గ్రామాల్లో స్థలాల కొరత
- పంచాయతీ కార్యదర్శుల పాట్లు



నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మొక్కలు

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధవుతోంది. జిల్లాలో కొత్తకోట మండలాన్ని నెంబర్‌వన్‌గా నిలపాలన్న సంకల్పంతో అధికారులు అందుకు తగిన ఏర్పాట్లపై దృష్టి కేంద్రీకరించారు. మండల వ్యాప్తంగా 1లక్ష30వేల మొక్కలు నాటాలని జిల్లా అధికారులు ఆదేశాలను జారీ చేశారు. అంతకుమించి మొక్కలు నాటేందుకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పంచాయతీ కార్యదర్శులు ఉపాధి సిబ్బందితో వనమహోత్సవాల కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.

నర్సరీలు సిద్ధం..

ఎరువులు, ఎర్రమట్టితో మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీ స్థలాలు ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటేలా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లోని నర్సరీల్లో గ్రామవసరాలకు అనుకూలంగా పూల మొక్కలు టికోమో, గనేరు, బోగన్‌విలియా, పండ్లమొక్కలు, జామ, నేరేడు, ఈత, చింతచెట్టు, వేప, మోదుగ, కరివేపాకు మొక్కలతో పాటు అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు గులుమోహర్, సీమతంగేడి, రేయిన్‌ట్రీ వంటి తదితర మొక్కలను పెంచుతున్నారు.

స్థలాల కొరత :

మొక్కలు నాటేందుకు స్థలాల కొరత నెలకొన్నది. పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఎక్కడా ఖాళీ లేకపోవడంతో మొక్కలు నాటేందుకు సమస్య ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్థలాల గుర్తింపు కోసం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

గుట్టల ప్రాంతంలో ఎక్కువ శాతం మొక్కలు

మండలంలో అటవీ, గుట్టల ప్రాంతాల్లో హరిత హారం మొక్కలు నాటి లక్ష్యం చేరేందుకు అధికారులు సిద్ధపడుతున్నారు. మొక్కలకోసం స్థలం సమస్యతో రోడ్లకు ఇరువైపులా ఇదివరకే నాటిన చెట్ల మధ్య మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్నారు.

లక్ష్యం మంచిదే



గత ప్రభుత్వం హరితహారం పేరుతో రూ.కోట్లు ఖర్చు చేసి మొక్కలు నాటారు. లక్ష్యం మంచిదే కానీ రోడ్ల వెంట నాటే సమయంలో విద్యుత్ వైర్ల కింద నాటడంతో రెండేళ్ల తర్వాత చెట్లుగా మారి పెద్దగా అవడంతో కరెంట్ వైర్ల కింద ఉన్నాయంటూ విద్యుత్‌శాఖ అధికారులు చెట్లను తొలగిస్తున్నారు. మొక్కల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలి. – నాగరాజు, కొత్తకోట

మొక్కలను రక్షించడంలో విఫలం



ప్రతిఏడాది రూ.లక్షలు ఖర్చు చేసి మొక్కలు నాటుతున్న అధికార యంత్రాంగం వాటిని రక్షించుకోవడంతో విఫలమవుతున్నారు. అధికారులు వారికి ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎక్కడపడితే అక్కడ మొక్కలు నాటి చేతులు దులిపేసుకుంటున్నారు. మొక్కలు నాటే ముందు భవిష్యత్తులో వాటి నుంచి ఉపయోగం ఉండేలా తప్ప, ఇబ్బంది ఉందని తీసేయడం మంచిది కాదు. – గోవర్ధన్, కానాయపల్లి

లక్ష్యాన్ని చేరుకుంటాం



ఈ ఏడాది మొక్కలు నాటేందుకు అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు మండలంలోని 22 పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. నర్సరీల్లో పండ్లు, నీడనిచ్చే మొక్కలను పెంచుతున్నాం. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు స్థలాల సమస్యగా మారింది. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. – శ్రీనివాసులు, ఎంపీడీఓ, కొత్తకోట

వాటర్ బాటిల్స్ పంపిణీ



వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ భద్రసేన్ సొంత ఖర్చుతో వాటర్‌బాటిల్స్, ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం కంటే ఈ సారి ఎక్కువ మంది విద్యార్థులు కళాశాలలో చేరారని అందుకు కృషి చేసిన కళాశాల అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణకుమారి, హనుమంతురెడ్డి, కృష్ణయ్య, రవీందర్, జ్ఞానేశ్వర్‌రెడ్డి, జాకీర్‌హుస్సేన్, ఈశ్వర్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల నియంత్రణకు చర్యలు



వనపర్తి టౌన్: వీధుల్లో కుక్కల బెడద ఉండని వ్వకుండా వాటన్నింటిని పట్టుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శనివారం 100 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాకేంద్రంలోని వీధికుక్కలను పట్టుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయావార్డుల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయావార్డులో డ్రైనేజీల్లో మురుగును దగ్గరుండి తీయించి శుభ్రం చేయించారు. అదేవిధంగా హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ ఓ చికెన్ షాపు పరిశుభ్రంగా లేనందున రూ.2,000, పలు షాపుల్లో ప్లాస్టిక్ వాడుతున్నందుకు రూ.7,000 జరిమానా వేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, డీఎంసీ బాలరాజు, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొనారు.

పార్కింగ్ అస్తవ్యస్తం



పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారిలో వాహనాలను అస్తవ్యస్తంగా పార్కింగ్ చేయడంతో ప్రజలు ప్రతీ నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండడంతో ఈ దారి ప్రతినిత్యం రద్దీగా ఉంటుంది. ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలకు వాహనాలు నిలిపి ఉంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయకుండా చూసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించండి

ఆత్మకూర్: మున్సిపాలిటీ అభివృద్ధికి వార్డుల అధికారులు పాటుపడాలని, నిత్యం స్థానికంగా ఉండే అందరికీ అందుబాటులో ఉండాలని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో వార్డుల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్యం, వనమహోత్సవం, ఇంకుడుగుంతల నిర్మాణాలు తదితర విషయాలపై పట్టణ వాసులకు అవగాహన కల్పించాలని వివరించారు. 100 రోజుల ప్రణాళిక, తాగునీటి వనరులు, ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన, పారుశుద్ధ్య పనులు, ట్రేడ్ లైసెన్సులు, జనన, మరణ ధృవీకరణ, భవన నిర్మాణ అనుమతులు, అక్రమ నిర్మాణాలపై చర్యలు, ఫ్లెక్సీల ఏర్పాటుపై పన్నుల వసూలు, వీధిదీపాల నిర్వహణ, వనమహోత్సవంలో భాగంగా లక్ష్యానికిమించి మొక్కలు నాటడం తదితర విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వార్డుల అధికారులు ఝాన్సీరెడ్డి, అనుషా, మోహన్, కాషన్న, ముబ్బషీర్, అశోక్, మోహన్‌సాగర్, దయానంద్, శివన్న, మధుబాబు, ఆశన్న, మక్బూల్, అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ఆత్మకూర్: దోమల నివారణకు చర్యలు చేపడుతున్నామని, పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని జాగ్రత్తలను తీసుకుని రోగాలను తరిమేయాలని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. శనివారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా వార్డులో సిబ్బందితో కలిసి ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కాలనీల్లో వర్షపునీరు చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీంతో దోమలు వ్యాప్తి చెందే అవకాశాలున్నాయని, కాగా డ్రమ్ముల్లో, హౌసుల్లో నీరు నిల్వ ఉంచకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ సురేందర్‌గౌడ్, పురపాలిక సిబ్బంది తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ శశిధర్

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

గోపాల్‌పేట: గత ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు అన్నారు. శనివారం రేవల్లిలో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ కార్మికులు ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు కార్మికుల వేతనాలు చెల్లించాలని అలాగే తాము ఈనెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఐదు నెలలనుంచి ఇప్పటివరకు జీతాలు రాలేదని కాంట్రాక్టరును అడిగితే బిల్లులు కాలేదని సమాధానం చెప్తున్నాడని ఇలా అయితే తమ ఇండ్లు ఎలా గడుస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తమకు జీతాలు ఇప్పించాలని కోరారు. అంతేకాకుండా కార్మిక వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ ఈనెల 9న సమ్మెలో పాల్గొంటున్నామన్నారు. కార్యక్రమంలో సిద్ధు, ఆశాబీ, ఇందిరా, వెంకటమ్మ, జహీరాబీ, లక్ష్మమ్మ, లక్ష్మీదేవమ్మ, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఖిల్లాఘనపురం: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు జయశంకర్ అన్నారు. మండల క్లబ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. మండలంలోని షాపురం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులను మండల అధ్యక్షుడు విశ్వనాథంతో పాటు దాతలు సత్యనారాయణగౌడ్‌తో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతస్థాయిలో ఉండాలంటే చదువుతో పాటుగా మంచి విలువలను అలవర్చుకోవాలన్నారు. దాతల సహకారంతో క్లబ్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎన్ఆర్ఐ రవిప్రకాష్‌రెడ్డి, సుధీర్ కొండేటి 80 మండలాల్లో 10వేల చెస్‌బోర్డులు పంపిణీ చేసేందుకు ముందుకు రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మన్యంగౌడ్, హెచ్ఎం కాళిదాస్, మునావర్ సుల్తానా, చెన్నప్ప, లక్ష్మీకాంత్, రాఘవేందర్, మహిపాల్‌రెడ్డి, ఉమాదేవి, ప్రశాంతి, లలిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడు

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన మాజీమంత్రి

వనపర్తి విద్యావిభాగం: మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావును మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్వల్ప అస్వస్థకు గురై చికిత్స పొందిన కేసీఆర్‌ను వారు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కొద్దిసేపు భేటీ అయిన వారితో కేసీఆర్ పార్టీ నిర్మాణం, రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమస్యలు, జిల్లాలో పార్టీ బలోపేతంపై చర్చించి పలు సూచనలు చేసినట్టు వారు తెలిపారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, గువ్వల బాలరాజు తదితరులు ఉన్నారు.



కేసీఆర్‌ను కలిసిన నిరంజన్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి

మా హయాంలో మారిన మార్కెట్ రూపురేఖలు

- గత ప్రభుత్వం నిర్వీర్యం చేశారు
- మార్కెట్‌కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్

వనపర్తి విద్యావిభాగం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు మార్కెట్‌యార్డుల రూపురేఖలు మార్చారని మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం పాలకమండలి వార్షికోత్సవం సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2007 నుంచి 2010 వరకు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశానని, తిరిగి ఇటీవల ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చొరవతో రెండోసారి మార్కెట్ చైర్మన్‌గా తాను బాధ్యతలు స్వీకరించానన్నారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మార్కెట్‌కు వచ్చే రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. తనకు రెండుపర్యాలు రైతులకు సేవచేసుకునే అవకాశం ఇచ్చే కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటానన్నారు. రైతుల సంక్షేమం కోసం రూ.80వేల కోట్లు రుణమాఫీ, రైతుభరోసా, ధాన్యం కొనుగోలు, ఇతర అవసరాలకు ఖర్చు పెట్టిన ఏకైక ప్రభుత్వంగా చరిత్రలో మిగిలిందన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించామన్నారు. 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రైతులకు పూర్తి రక్షణ కల్పించామన్నారు. అదే విధంగా రైతుల కోసం తాగునీటి సౌకర్యం మరుగుదొడ్లు, ఇతర వసతులను కల్పిస్తూ అధ్వానంగా ఉన్న సీసీరోడ్లు, ప్లాట్‌ఫారాలు నిర్మించామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసమర్థత వల్ల యార్డులో వర్షపునీరు నిండుకొని రైతులు పండించిన పంట నీటిపాలు అయిందన్నారు. ఈ విషయంపై చైర్మన్ తన బాధ్యతను నిర్వర్తిస్తూ వర్షపునీరు నిల్వలేకుండా గుంతలు గుంతలు ఉన్న మార్కెట్ యార్డు ప్రాంతం సుందరవనంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వం యార్డు నిర్మాణానికి రూ.43 కోట్ల ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రామకృష్ణారెడ్డి, పాలకవర్గ సభ్యులు, కొత్తగొల్ల కృష్ణయ్య, చీపుర్ల శ్యాంసుందర్‌రెడ్డి, రాములునాయక్, గోపాల్‌నాయక్, ఉమేష్‌కుమార్, సురేష్, లతీఫ్‌హుద్దీన్, బండారు రాజేందర్, సదుర్లశారదతోపాటు వనపర్తి మాజీ జెడ్పీచైర్మన్ లోకనాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బి.కృష్ణ, పార్టీ సమన్వయకర్త సతీశ్, దళిత నాయకుడు వెంకటేశ్, మహిళా నాయకురాలు ధనలక్ష్మి, ఎస్ఎల్ఎన్ రమేశ్, యాపర్లరాంరెడ్డి, మాజీ కౌన్సిలర్ బ్రహ్మం. యువ నాయకుడు రాహుల్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆత్మకూర్: సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని, ఎన్నికల హామీలను అమలు చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్రనాయకుడు ప్రసాద్, టీయూసీఐ జిల్లా కార్యదర్శి సామేలు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ చాంద్‌పాషాకు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమయ్యాయన్నారు. ఉచితవైద్యం, విద్య అందని ద్రాక్షగా మిగిలిందని అసహనం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, ఫ్రీ విద్యుత్, పెన్షన్లు, తాగునీటి సౌకర్యం, గ్యాస్‌సబ్సిడీ, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు ఇలా ఎన్నో హామీలు అమలు చేయాల్సి ఉందని గుర్తు చేశారు. అమలు చేయకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, బాలస్వామి, రాములు, వెంకటన్న, బాలస్వామి, మధు, అంజి, భగవంతు, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

అమరచింత: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఏడో వార్షికోత్సవ వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చన, అభిషేకం, పడిపూజ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ చేశారు. పూజా కార్యక్రమంలో గురుస్వామి మాకం నరసింహులు ఆధ్వర్యంలో పడిపూజ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణయ్య, శివయ్యలు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం

అమరచింత: టీయూసీఐ ఆధ్వర్యంలో ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా కోశాధికారి రాజు కోరారు. మండలంలోని మస్తీపురం గ్రామంలో శనివారం సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికహక్కుల పరిష్కారానికి అసంఘటిత కార్మికులు ఐక్యంగా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో టీయూసీఐ నాయకులతో పాటు పలువురు పాల్గొన్నారు.

యజమానిపై కేసు నమోదు

వనపర్తి రూరల్: బాలుడిని పనిలో పెట్టుకున్న షాపు యజమానిపై శనివారం కేసు నమోదు చేసినట్లు పెబ్బేరు ఎస్ఐ యుగేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు పట్టణానికి చెందిన వీరన్నచారి తన కార్పెంటర్ షాపులో బాల కార్మికుడిని పనిలో పెట్టుకున్నాడు. పనిచేస్తుండటం గమనించిన ఆపరేషన్ ముస్కాన్ 11సంస్థ, లేబర్ ఆఫీసర్ రఫీ తన సిబ్బందితో వెళ్లి ఆ బాలుడిని తీసుకెళ్లారు. లేబర్ ఆఫీసర్ శనివారం పోలీస్‌స్టేషన్‌లో షాపు యజమానిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీరన్నచారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. వ్యాపారాలు చేస్తున్న వారు 18ఏళ్ల దాటని పిల్లలను పనిలో పెట్టుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ప్రతి రైతుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

అమరచింత: వ్యవసాయ పట్టాదారు పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ అరవింద్ అన్నారు. మండలకేంద్రంలోని చంద్రగడ్‌లో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలు పీఎం కిసాన్ వేసేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. సంబంధిత గ్రామాల ప్రజలు వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అలయ్..బలయ్

అమరచింత: మొహర్రం సందర్భంగా శనివారం పట్టణంలో జీఎస్ నగర్‌లోని కర్బాలా ప్రాతంలో ఖాసీం పీర్ల అలయ్..బలయ్ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం రాత్రి మండలంలోని ఆయా గ్రామాల్లో కొలువుదీరిన ఖాసీం పీర్ల సవారి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించి పీర్లకు మలీజ. బెల్లంపానకం నైవేద్యంగా సమర్పించారు. కొత్త దట్టీలు, పూల చాదర్‌లను సమర్పించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



వనపర్తి రూరల్: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్. రామచంద్రరావు శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ నాయకులు మెంటెపల్లి పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయ్యవారి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సందావెంకటేశ్, రాజేందర్‌రెడ్డి కలిసి రామచంద్రరావును శాలువాతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



మదనాపురం: మండలంలోని కొన్నూరులో శనివారం చిన్న వెంకటన్న మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ సభ్యులు శరత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఇంటికి వెళ్లి వెంకటన్న మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. గ్రామంలో పేదవారికి ఎలాంటి ఇబ్బందులు వచ్చిన ఆయన అండగా ఉంటారని నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బి.గోపాల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బారికేడ్స్ ఏర్పాటు చేయాలి



వనపర్తి టౌన్: అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ నిర్మాణ పనులను పట్టించుకునే నాథుడే లేడని, అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం నూతన సీసీ రోడ్డు నిర్మాణంపై బైఠాయించి నిరసన తెలిపారు. గత ప్రభుత్వం సీసీ రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణానికి మంజూరు చేసిన రూ.55కోట్లతో 33, 23, 24వ వార్డుల మధ్యలో సీసీరోడ్డు నిర్మిస్తున్నారు. పూర్తయ్యేవరకు వాహనాలు తిరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు త్వరగా దెబ్బతిని ప్రజా ఆదాయానికి గండిపడుతుందన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లుకు ఫోన్‌చేసి సమస్య వివరించచారు. స్పందించిన కమిషనర్ సైట్ ఇన్‌స్పెక్టర్‌ను పంపి మట్టికుప్పలను అడ్డంగా పెట్టించడంతో ఉంగ్లం తిరుమల్ నిరసనను విరమించుకున్నారు. అనంతరం సీసీరోడ్డు నిర్మాణ పనులు యథావిధిగ జరిగాయి.